AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com

12-9-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## గ్యాస్ కష్టాలకు తెర..!







## బాల్కొండ అభివృద్ధికి రూ.250 కోట్లు ఇవ్వండి


## ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.11 కోట్ల నిధులు



**అక్షరటుడే, నందిపేట/డొంకేశ్వర్:** దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతులకు రూ.11 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పెర్కిట్ చౌరస్తా-నిర్మల్ హైవే, మామిడిపల్లి చౌరస్తా-హైదరాబాద్ హైవే రోడ్లకు రూ.5.60 కోట్లు కేటాయించారు. అలాగే డొంకేశ్వర్ మండలం తొండాకూర్-గాదేపల్లి మల్లన్న గుడి రహదారి మరమ్మతులకు రూ.4.40 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు ఖరారైన నేపథ్యంలో త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. దీంతో రహదారుల దుస్థితితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఊరట కలగనుంది.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి : మేయర్ ఉమారాణి




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని మేయర్ ఉమారాణి అన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 2వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ మండలి నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ వినాయక మండపాల నిర్వాహకులను ఉద్దేశించి మాట్లాడుతూ, గణేష్ నవరాత్రులను భక్తి శ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ సహకరించాలని, పోలీసు అధికారులు ఇచ్చే మార్గదర్శకాలను పాటించాలని కోరారు. పోలీసు అధికారులు నిబంధనల గురించి మండలి నిర్వాహకులకు వివరించారు. ఈ సమావేశంలో ఏసీపీ ప్రకాష్, 2వ టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్సై యాదగిరి పాల్గొన్నారు.




## మైనార్టీల కోసమే ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని నిర్వహించట్లేదు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** మైనార్టీల కోసమే ప్రభుత్వ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించట్లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆరోపించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల తరహాలోనే తెలంగాణలోనూ అధికారికంగా నిర్వహించాలని దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంతుష్టీకరణ రాజకీయాల కోసమే సెప్టెంబర్ 17 వేడుకలను నిర్వహించకుండా చేస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి 'రేవంత్ ఉద్దీన్'లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రజాకార్ల హయాంలో సాగిన బలవంతపు మత మార్పిడులు, రామ్‌జీ గోండ్ సహా వెయ్యి మందిని ఉరితీసిన నిర్మల్ ఉదంతం, వల్లాలలో త్రివర్ణ పతాకం ఎగురవేసిన పది మంది బడిపిల్లల హత్య, గుండ్రంపల్లి బావిలో 200 మందిని ఊచకోత కోసిన అకృత్యాలను ఆయన గుర్తుచేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, ప్రమోద్ కుమార్, న్యాలం రాజు, పద్మరెడ్డి, బొబ్బిలి వేణు గోపాల్, పురుషోత్తం, జగన్ రెడ్డి, ఆనంద్, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలు, వైర్లను సరిచేయాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** గణపతి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో 38వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వార్డులో వంగిపోయిన పాత విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న వైర్ల వల్ల భక్తులకు, స్థానికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని గుర్తించి, నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. తాజాగా ఏర్పాటు చేసిన స్తంభాల అమరిక పనులను ఆమె స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ వినాయక నవరాత్రుల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా లో కొన్ని చౌక ధరల దుకాణాలు బినామీల చేతుల్లో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో డీలర్లు వీటిని ఇతరులకు అప్పగించి నెలవారీగా కమీషన్లు తీసుకుంటున్నారు. దుకాణాలు దక్కించుకున్న బినామీలు బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడుతూ.. అందినకాడికి దండుకుంటున్నారు. దందా దర్జాగా కొనసాగుతున్నా.. తనిఖీలు మరిచిన అధికారుల తీరుపై సర్వత్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**- అక్షరటుడే, డిచ్‌పల్లి**



■ ఉమ్మడి జిల్లాలో బినామీలదే రాజ్యం ■ అనధికార వ్యక్తుల చేతుల్లో దుకాణాలు
■ తనిఖీలు మరిచిన పౌరసరఫరాల శాఖ ■ సివిల్ సప్లయ్ నిర్లక్ష్యంపై అనుమానాలు

# రేషన్ బియ్యంతో డీలర్ల దందా

నిజామాబాద్ జిల్లాలో 760 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 4,02,035 రేషన్ కార్డులు ఉండగా.. కామారెడ్డిలో 583 రేషన్ దుకాణాలు.. 2,53,297 రేషన్ కార్డులు ఉన్నాయి. పురపాలికలు, పట్టణాల్లో విలీనమైన గ్రామాల్లో పలు రేషన్ దుకాణాలను అనేక చోట్ల బినామీలే నిర్వహిస్తున్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో అనధికార వ్యక్తులు దుకాణాలు నిర్వహిస్తున్నారని ఆరోపణలున్నాయి.

### నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

రేషన్ డీలర్ మృతి చెందినా.. తొలగించినా, రాజీనామా చేసిన చోట నిర్ణీత ప్రక్రియ ద్వారా కొత్త డీలర్‌ను నియమించాలి. గతేడాది జిల్లాలో కొత్తకార్డులు మంజూరు చేశారు. అయితే కార్డులకు అనుగుణంగా దుకాణాలు కేటాయించలేదు. 500 కార్డులకు మించి ఉంటే అదనంగా మరో దుకాణం తప్పనిసరి. కొత్త పంచాయతీల్లో కార్డుల సంఖ్యతో నిమిత్తం లేకుండా చౌకధరల దుకాణం ఏర్పాటు చేయాలి.

### అదనపు బాధ్యతలతో ఆపసోపాలు

బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడిన వారిపై అధికారులు కేసు నమోదు చేసి ఆ దుకాణ బాధ్యతను సమీప డీలర్‌కు (ఇన్‌ఛార్జిగా) అప్పగిస్తున్నారు. ఇలా కొందరు డీలర్లు రెండు, మూడు దుకాణాల బాధ్యతలను చేపట్టాల్సి వస్తోంది. దీంతో ఆర్థికంగా బలంగా ఉన్న కొందరు డీలర్లు ఇతరులకు అనధికారికంగా దుకాణాలు అప్పగించి కమీషన్ తీసుకుంటున్నారు. కొన్ని చోట్ల రెవెన్యూ అధికారులు బినామీలకు వేలిముద్రల ఆథరైజేషన్ ఇవ్వడం గమనార్హం.

### రాజకీయ ఒత్తిళ్లు..!

ఉమ్మడి జిల్లా పరిధిలోని పల్లెలు, పట్టణాల్లో కార్డుల సంఖ్యకు అనుగుణంగా కొత్త రేషన్ షాపుల ఏర్పాటుకు పాలనా పరమైన, రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. దీంతో అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. రెగ్యులర్ డీలర్లు లేని దుకాణాల్లో చాలా వరకు బినామీలే పాగా వేస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి కేసు నమోదు చేయాలని గతంలో సర్కారు పౌరసరఫరాలశాఖ అధికారులను ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించడం లేదు. అక్రమాలకు పాల్పడిన రేషన్ డీలర్లపై చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల అధికారులు చెప్తున్నా ఇందుకు భిన్నంగా మారింది. ఇప్పటికైనా బినామీల రేషన్‌దుకాణాలపై చర్యలు తీసుకోవాలని.. లబ్ధిదారులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో కఠినంగా వ్యవహరిస్తాం : సీపీ సాయిచైతన్య



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో కఠినంగా వ్యవహరిస్తామని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పీఎస్ పరిధుల్లో ఆరు వారాల్లో డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో 1,784 మంది పట్టుబడ్డారన్నారు. వారిని నిజామాబాద్, బోధన్ అర్మూర్ కోర్టుల్లో హాజరుపర్చగా 124 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించామని తెలిపారు. మిగిలిన వారికి రూ. రూ.కోటికి పైగా జరిమానా వేశామని చెప్పారు. ఈ నెల 2వ తేదీ నుండి 12వ తేదీ వరకు జిల్లాలో వాహన తనిఖీలు నిర్వహించి, మొత్తం 1,784 కేసుల నమోదు చేశామన్నారు. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదని సీపీ పేర్కొన్నారు. వాహనాదారులు వాహనానికి సంబంధించిన పత్రాలు తప్పక తమ వెంట ఉంచుకోవాలన్నారు. డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి లైసెన్స్ ఆర్నెళ్లపాటు సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనం నడిపి రోడ్ ప్రమాదం జరిగినట్లయితే ఇన్సూరెన్స్ లభించదన్నారు. మైనర్లు తాగి వాహనం నడిపి పోలీస్ వారికి దొరికినట్లైతే మైనర్, వెహికల్ ఓనర్ పైన ఛార్జ్‌షీట్ నమోదు చేస్తామని తెలిపారు.

## నిరసనల సమయంలో సంయమనం పాటించాలి : ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి:** నిరసనలు, ఆందోళనల సమయంలో పోలీసు సిబ్బంది సంయమనంతో వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బందికి బందోబస్తు విధుల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. హోంగార్డు స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు బందోబస్తు విధులు కీలకమని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును గౌరవిస్తూనే శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పరిస్థితులను అదుపు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. చేయదగినవి, చేయకూడని పనులపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియాలో నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మవద్దని, ప్రచారం చేయవద్దని, విధి నిర్వహణలో వృత్తి నైపుణ్యం ప్రదర్శించాలని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్స్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజలతో మర్యాదగా, చట్టబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు సంతోష్ కుమార్, నవీన్ పాల్గొన్నారు.

## మచ్చలేని నాయకుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ : నగేష్ రెడ్డి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ 40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడు అని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి అన్నారు. పీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్ గౌడ్ రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని ఆటోనగర్‌లో వక్ఫ్ బోర్డ్ మాజీ ఛైర్మన్ మాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఆటోనగర్‌లో టెలిఫోన్ కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పీసీసీ చీఫ్ 40ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌పై స్థానిక ప్రజలకు వివరించారు. ఎన్ఎస్‌యూఐలో కార్యకర్త నుంచి నేటి పీసీసీ చీఫ్ వరకు ఆయన సాధించిన విజయాలను స్క్రీన్‌పై చూపించారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, మేయర్ ఉమారాణి మాట్లాడుతూ.. రెండేళ్ల కాలంలో పీసీసీ చీఫ్ సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో విజయవంతమయ్యామన్నారు. ఆయన సారథ్యంలో వచ్చే ఎన్నికల్లోనూ విజయదుందుభి మోగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజేంద్రప్రసాద్, బంటు బలరాం, కార్పొరేటర్ నయీం షెహరాన్, సజ్జత్, అన్వర్, కరీం, అహ్మద్, నరేందర్ సింగ్, పత్తి శోభన్ కుమార్, రాజ్ గగన్ పాల్గొన్నారు.

## 50 ఏళ్ల ఇనుప స్తంభాల సమస్యకు పరిష్కారం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** 50 ఏళ్లుగా కళ్యాణి గ్రామ ప్రజలను వేధిస్తున్న తుప్పు పట్టిన ఇనుప విద్యుత్ స్తంభాల సమస్యకు ఎట్టకేలకు ముగింపు లభించింది. గ్రామంలో శిథిలావస్థకు చేరి, ఎప్పుడు కూలిపోతాయోనని.. విద్యుత్ షాక్‌లతో ప్రమాదకరంగా మారిన పాత ఇనుప పోల్స్ గురించి గ్రామస్తులు సర్పంచ్ నవ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ దృష్టికి తీసుకువెళ్లారు. విషయాన్ని తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే స్పందించి, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు. అధికారులు సైతం తక్షణమే స్పందించి గ్రామంలో పాత పోల్స్ తొలగించి, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించారు. దశాబ్దాల సమస్యను పరిష్కరించి, ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చేసిన ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, చొరవ తీసుకున్న సర్పంచ్ నవ్యకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 3,173 కేసులు పరిష్కారం




**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లావ్యాప్తంగా శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ఘన విజయం సాధించింది. జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద కోర్టుల పరిధిలో మొత్తం 3,173 కేసులు రాజీ మార్గంలో పరిష్కరించారు. ఇందులో 21 సివిల్ కేసులు, 3,085 క్రిమినల్ కేసులు, 67 పీఎల్‌సీ కేసులు ఉన్నాయి. కోర్టుల వారీగా పరిశీలిస్తే కామారెడ్డి కోర్టు పరిధిలో అత్యధికంగా 1,676 కేసులు, బాన్సువాడ కోర్టులో 635 కేసులు, ఎల్లారెడ్డి కోర్టులో 385 కేసులు, బిచ్కుంద కోర్టులో 477 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ కేసుల్లో ఎక్కువగా రాజీకి వీలున్న క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, భూ వివాదాలకు సంబంధించిన సివిల్ కేసులు ఉన్నాయి. అదేవిధంగా ఈ లోక్ అదాలత్‌లో 11 మోటార్ వాహన ప్రమాద కేసులు కూడా రాజీ కుదరడం విశేషం. ఈ కేసుల్లో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు, తీవ్రంగా గాయపడిన బాధితులకు కలిపి మొత్తం రూ.1.17 కోట్ల పరిహారంగా అవార్డు అందించారు. రానున్న రోజుల్లో కూడా ప్రజలు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకొని పరస్పర అంగీకారంతో తమ వివాదాలను పరిష్కరించుకోవాలని వారు సూచించారు.

## కర్షకుల కన్నెర్ర.. కరెంట్ కోతలపై ట్రాన్స్‌కో ఎస్ఈ ఆఫీస్ ముట్టడి



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రస్తుత పరిస్థితుల్లో రైతాంగానికి 18 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాల్సిందేనని భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్ చేసింది. శనివారం బీకేఎస్ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో రైతులు కామారెడ్డి విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించారు. పాత జాతీయ రహదారిపై బైఠాయించి నాలుగు గంటలకు పైగా ఆందోళన చేపట్టారు. వ్యవసాయ పనుల నేపథ్యంలో తమ బాధలను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా కిసాన్ సంఘ్ నాయకులు, రైతులు మాట్లాడుతూ.. వేల రూపాయల పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేస్తే పంటలకు నీరు అందడం లేదని, కరెంట్ కోతలతో కర్షకులను కన్నీళ్లు పెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులంటే ప్రభుత్వానికి చిన్న చూపు అయిందని, ఎన్నికలకు ముందు హామిలిచ్చి మర్చిపోతారా అని నిలదీశారు.24 గంటల సరఫరా చేస్తామని చెప్పారని హామీ ఏమైందని ప్రశ్నించారు.

## సర్పంచుల సమస్యలు తీర్చాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** గ్రామాల్లో ఎదురవుతున్న పలు రకాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్పంచుల ఫోరం ప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కను కలిశారు. గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల, గ్రామాభివృద్ధి, సర్పంచుల సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు మంత్రి సీతక్కను ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సర్పంచుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందనే నమ్మకం ఉందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలసి సమస్యల పరిష్కారానికి విన్నవించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు మునుపెల్లి సాయి రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరిగెల జనార్ధన్, వేల్పూర్ మండల అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి జన్ను జనార్ధన్, ఉపాధ్యక్షుడు బేల్దారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ దరఖాస్తుల పరిశీలన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో పంఛన్ దరఖాస్తుదారుల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. శనివారం మున్సిపల్ కమిషనర్ జీవన్ పలు వార్డుల్లో పర్యటించారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో వార్డు అధికారులు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను పరిశీలిస్తున్నామన్నారు. వితంతు, ఒంటరి మహిళా, వికలాంగ పింఛన్లకు సంబంధించి అందిన దరఖాస్తులను ఆధార్, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర పత్రాల ఆధారంగా వెరిఫికేషన్ చేస్తున్నట్లు తెలిపారు. అనర్హులను గుర్తించి తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందేలా పారదర్శకంగా వ్యవహరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎల్‌పీజీ రీఫిల్ బుకింగ్ గడువును 45 రోజుల నుండి 25 రోజులకు తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 2026లో మధ్యప్రాచ్య సంక్షోభం కారణంగా ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి ఏర్పడింది. దీంతో కేంద్రం తాత్కాలికంగా డిమాండ్ మేనేజ్‌మెంట్ చర్యల్లో భాగంగా పట్టణాల్లో 25 రోజులు, గ్రామాల్లో 45 రోజుల గ్యాప్ విధించింది. – అక్షరటుడే, ఎల్లారెడ్డి

# గ్యాస్ కష్టాలకు తెర..!

- గుడ్‌న్యూస్ చెప్పిన కేంద్రం
- 25 రోజులకే సిలిండర్ బుకింగ్ సౌకర్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు




కామారెడ్డిలో జిల్లాలో మొత్తంగా 3,21,250 గ్యాస్ కలెక్షన్లు ఉన్నాయి. ఇందులో 1,10,352 సిలింగ్ సిలిండర్ కనెక్షన్లు ఉండగా.. 85,387 డబుల్ సిలిండర్ కనెక్షన్లు, దీపం పథకం కింద కనెక్షన్లు 59,462 ఉన్నాయి. ఇక కమర్షియల్ కనెక్షన్లు 940 ఉన్నాయి. ఉజ్వల పథకం కింద 34,323 కనెక్షన్లు, సీఎస్ఆర్ కనెక్షన్లు 30,786 ఉన్నాయి. అయితే దేశంలో గ్యాస్ సరఫరా పరిస్థితి మెరుగుపడటం, పెండింగ్ బుకింగ్స్ బ్యాక్ లాగ్ గణనీయంగా తగ్గడంతో ఈ ఆంక్షలను సడలించినట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి సురేష్‌గోపి వెల్లడించారు.

### పట్టణాలు, గ్రామాలకు ఒకే రూల్:

ఈ మేరకు పెట్రోలియం మంత్రిత్వ శాఖ సెప్టెంబర్ 7న ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లకు లేఖ రాసింది. దేశవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ తేడా లేకుండా అందరికీ ఒకే విధంగా 25 రోజుల ఇంటర్‌రీఫిల్ బుకింగ్ గ్యాప్‌ను తక్షణమే అమలు చేయాలని ఆదేశించింది. ప్రస్తుత ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడటం, రీఫిల్ బ్యాక్ లాగ్ గణనీయంగా తగ్గిన దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వం ఈ పరిమితిని సడలించింది. ఇప్పుడు పట్టణమా, గ్రామమా అనే తేడా లేకుండా అందరు గృహ వినియోగదారులు 25 రోజులకే రీఫిల్ బుక్ చేసుకోవచ్చు"

### వినియోగదారులకు ప్రయోజనం..

ఒక సిలిండర్ బుక్ చేసిన 25 రోజుల తర్వాతే మరో సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం. పండుగలు, శుభకార్యాలు, ఎక్కువ వినియోగం ఉన్న కుటుంబాలకు ఇక 45 రోజులు వేచి చూడాల్సిన అవసరం లేదు. గ్రామీణ వినియోగదారులకు పట్టణ వినియోగదారులతో సమానంగా సేవలు అందనున్నాయి.

## సీతారాం ఏచూరికి నివాళి



**అక్షరటుడే, ఆర్మూర్:** సీతారాం ఏచూరి ఆశయాలకనుగుణంగా పోరాడుతామని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. శాస్త్రి నగర్‌లో సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. సీతారాం పార్లమెంటులో రాజ్యసభ సభ్యుడిగా ఉండి కార్మికులు పేదలు రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేశామన్నారు. దోపిడీ వ్యవస్థ పోయేవరకు బడుగులను ఐక్యం చేసి సీతారాం ఏచురి ఆశయాలకోసం పని చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జక్కం సుజాత, సాయిలు, కుమార్, ఓంకార్, పోగుల నగేష్ గౌడ్, ఎల్లయ్య, గోరిబాయ్, రాధా, లక్ష్మి పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**అక్షరటుడే, గాంధారి:** గాంధారిలో శనివారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఫారెస్ట్ ఆఫీస్‌లో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. అటవీ రేంజ్ అధికారి రమేష్ మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించడం ద్వారా చెరువులు, నీటి వనరులు కాలుష్యం కాకుండా కాపాడవచ్చన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణ హిత విగ్రహాలను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

## జేసీఐ ఆధ్వర్యంలో పౌర విధుల దినోత్సవం




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జేసీఐ ఇందూర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నగరంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో పౌర విధుల దినోత్సవం నిర్వహించారు. పౌరుల బాధ్యతల గురించి జేసీఐ ఇందూర్ అధ్యక్షుడు జైపాల్ కాలే వివరించారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ సమాజ దేశ హితం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థినులకు పౌర విధులు, సెల్‌ఫోన్ వినియోగం అంశాలపై ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ హాస్టల్ అధికారిణి సుజన ప్రియ, జేసీఐ ఇందూర్ పూర్వాధ్యక్షులు కోటగిరి చంద్రశేఖర్, చింతల గంగాదాస్, కార్యదర్శి తిరునగరి తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

## గోనుగొప్పులలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**అక్షరటుడే, భీమ్‌గల్:** ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని గోనుగొప్పుల సర్పంచ్ సేపూర్ చరణ్ గౌడ్ తెలిపారు. శనివారం గ్రామంలో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నూతన రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ సేవలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సులభంగా అందుతాయని పేర్కొన్నారు. జీపీవో శ్రీనివాస్, నాయకులు భోజాగౌడ్, మహేష్, శేఖర్, స్వామి నాయక్, భూమేష్, సుదర్శన్ గౌడ్, బొర్రన్న, శంకర్, హరీష్, గంగారాం, అజయ్ గౌడ్, గణేష్, కొబాజీ, మైపాల్, నర్సయ్య, రాజేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్‌లో మట్టి గణనాథుల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని చిన్న బజార్లో చౌల్ సాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ హాజరై గణపతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులను ఆరాధించాలని కోరారు. చౌల్ సాయి శ్రీనివాస్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, ఓమ్ ట్రేడర్స్ గంగ మోహన్, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

## మత్తు రహిత సమాజమే ధ్యేయం




**అక్షరటుడే, భీమ్‌గల్ :** మత్తు పదార్థాలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఈగల్ ఫోర్స్ అడ్వైజర్ కొండవీటి శ్యాం ప్రసాద్ పిలుపునిచ్చారు. భీమ్‌గల్ మండలంలోని లింబాద్రిగుట్ట ఒడ్డెర కాలనీలో శనివారం నిర్వహించిన 'యాంటీ డ్రగ్స్' అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలకు సైతం మత్తు పదార్థాలు పాకిపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్వార్థప్రయోజనాల కోసం కొందరు విక్రేతలు యువత, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. తల్లిదండ్రులు నిరంతరం తమ పిల్లల అలవాట్లను గమనిస్తూ, చెడు బాట పడకుండా చూసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల విక్రయదారులు, సరఫరాదారులపై ఉక్కుపాదం మోపుతామని భీమ్‌గల్ ఎస్సై పడిగెల శంకర్ హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల గురించిన సమాచారాన్ని స్థానిక పోలీసులకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయికి బానిసైతే ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్తు నాశనమవుతుందని, చట్టపరమైన తీవ్ర చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ ప్రతినిధులు ఉట్నూరి సాగర్, అడ్వాల శ్రీనివాస్, పంతుల మనోహర్, కొనింటి అనిల్‌కుమార్, మీనుగు నాగరాజు, శెట్టి శ్రీనివాస్, భీంగల్ పోలీస్ సిబ్బంది

## అనాథ వృద్ధులకు సర్పంచ్ ఆపన్నహస్తం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని వెల్లుట్లపేట సర్పంచ్ కొయ్యల వినోద రాజాగౌడ్ మానవత్వం చాటుకున్నారు. లింగంపేటలోని జీవదాన్ అనాథ ఆశ్రమంలో నివసిస్తున్న అనాథ, నిరాశ్రయ వృద్ధులకు శనివారం బియ్యం, నిత్యావసర సరుకులు, పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, స్నాక్స్ తదితరాలను పంపిణీ చేశారు. సర్పంచ్ కొయ్యల వినోద రాజాగౌడ్ మాట్లాడుతూ.. అనాథ వృద్ధులకు మనకు తోచినంత సాయం చేయడం మన సామాజిక బాధ్యత అన్నారు. వృద్ధులకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జీవదాన్ అనాథ ఆశ్రమం నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి లోక్ అదాలత్‌లో 385 కేసులకు పరిష్కారం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో మున్సిఫ్ కోర్టు రికార్డు సృష్టించింది. మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి ఎం.సుష్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌లో ఒకే రోజు మొత్తం 385 కేసులు సామరస్యంగా పరిష్కారమయ్యాయి. దీని ద్వారా మొత్తం రూ. 32,61,710 జరిమానాలు, రాజీ మొత్తాలు చెల్లించారు. ప్రజలకు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో న్యాయం అందించాలనే లక్ష్యంతో వివిధ రకాల సివిల్, క్రిమినల్, బ్యాంకు, సైబర్ కేసులను పరిష్కరించారు. 14 క్రిమినల్ కేసులు పరిష్కరించగా రూ.63 వేలు బాధితులకు అందించారు. 267 పీటీ కేసులు పరిష్కరించి రూ. 2,93,700 చెల్లించారు. 60 బ్యాంకు రుణ తగాదాలు పరిష్కరించగా రూ.28,15,010 డబ్బులు బాధితులకు అందజేశారు. ఒక సైబర్ నేరాన్ని పరిష్కరించి రూ.50వేలు తిరిగి అందజేశారు. 36 క్రిమినల్ తగాదాలు రాజీ కుదిర్చారు. 2 భత్యం కేసులు, 2 సివిల్ తగాదాలు కేసులు పరిష్కారామయ్యాయి. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరగా, తక్కువ ఖర్చుతో ఇరు పక్షాల పరస్పర అంగీకారంతో పరిష్కారమవుతాయని తెలిపారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పులు తుది తీర్పులుగా పరిగణించబడతాయని, వాటిపై అప్పీల్‌కు అవకాశం ఉండదని వివరించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన సబ్‌కలెక్టర్

**అక్షరటుడే, ఆర్మూర్:** పెర్కిట్ గ్రామంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెర్కిట్‌లోని పోలింగ్ స్టేషన్ నెంబర్లు 21, 26, 28, 29లను సందర్శించారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతిఒక్కరి పేరు నమోదయ్యేలా చూడాలని, ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా పనులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రత్యేక ప్రచార దినోత్సవాన్ని సద్వినియోగం చేసుకొని యువ ఓటర్లు అధిక సంఖ్యలో ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు.




## బాల్కొండ అభివృద్ధికి రూ.250 కోట్లు ఇవ్వండి



**అక్షరటుడే, భీమ్‌గల్:** బాల్కొండ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణంతో పాటు రెన్యువల్ పనుల కోసం రూ.250 కోట్ల నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌కుమార్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి వినతిపత్రంతో పాటు ప్రతిపాదనలను అందజేశారు. నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నియోజకవర్గంలోని పుష్కర ఘాట్లకు వెళ్లే రహదారులను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. పుష్కరాల వేళ భక్తుల రాక ఎక్కువగా ఉంటుందని, ఘాట్ల వద్ద మౌలిక సదుపాయాలు, తాత్కాలిక వసతులు మెరుగుపరచాలని వివరించారు. ముత్యాల సునీల్‌కుమార్ వినతిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు నియోజకవర్గ కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ప్రతిపాదిత పనులను పరిశీలించి, నిబంధనలకు లోబడి నిధుల మంజూరుకు తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు సునీల్ తెలిపారు.